క్లుప్తంగా

కలెక్టర్‌కు అయోధ్య అక్షింతలు అందజేత



చిలకలపూడి(మచిలీపట్నం): అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను కలెక్టర్ పి. రాజాబాబు, డీఆర్వో పెద్ది రోజాకు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకటగజేంద్ర బుధవారం అందజేశారు. అయోధ్యలో శ్రీరాముడి భవ్య మందిరం ప్రాణప్రతిష్ట అత్యంత వైభవంగా ఈనెల 22వ తేదీన జరుగనున్న నేపథ్యంలో అయోధ్యలోని బాల రాముని మందిరంలో భక్తిశ్రద్ధలతో పూజించిన అక్షింతలను కలెక్టర్, డీఆర్వోలకు అందజేశామని గజేంద్ర చెప్పారు.

దీవుల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలన

నాగాయలంక: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ దీవుల్లో తహసీల్దార్ జె.విమలకుమారి బుధవారం పర్యటించారు. 262 నుంచి 267 వరకు పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్ఓ పరిశీలించారు. ఎదురుమొండి, గొల్లమంద, కృష్ణాపురం, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించి బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ర్యాంప్, ఫర్నిచర్ తదితర సౌకర్యాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తంచేశారు. వీఆర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్

కాసానగర్(మోపిదేవి): జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ అన్నారు. పెదప్రోలు శివారు కాసానగర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లను బుధవారం పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్లలో స్టాపర్లను ఏర్పాటు చేశామన్నారు. తరచూ కాసానగర్ జంక్షన్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించి వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు ఈ స్టాపర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. గంజివానిపాలెం జంక్షన్ వద్ద కూడా స్టాపర్లను ఏర్పాటు చేస్తామన్నారు. చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్, ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధనుర్మాస ప్రసాదం పంపిణీ

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయకస్వామి ఆలయంలో బుధవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ధనుర్మాస ప్రసాద వితరణ జరిగింది. పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడిగా రవి చంద్రన్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా నాయకుడు వేముల కృష్ణ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు యెండూరి సురేష్, గాజుల భగవాన్, పాండురంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి సామూహిక కుంకుమార్చన



కోడూరు: కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని గోదాదేవి అమ్మవారికి బుధవారం సామూహిక కుంకుమార్చన భక్తిప్రపత్తులతో నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పల్లకీలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజ చేసి, నవహారతులిచ్చారు. ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

‘ఆడుదాం ఆంధ్రా’ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఉత్సాహంగా క్రీడా పోటీలు



అవనిగడ్డలో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు, క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని చెప్పారు. ఈ కార్యక్రమం వల్ల ఎందరో క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించడం ద్వారా మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాట్ పట్టుకుని క్రికెట్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్‌కుమార్, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, గాజుల జయగోపాల్ పాల్గొన్నారు.

- నాగాయలంక: ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో భాగంగా మండలంలోని నాలుగు జోన్లకు సంబంధించిన గ్రామస్థాయి క్రికెట్ ఫైనల్ పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో రోజు బుధవారం హుషారుగా సాగాయి. స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలను ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ ప్రారంభించారు. తలగడదీవి, పర్రచివర, నంగేగడ్డ, గణపేశ్వరం సచివాలయాల పరిధిలోని క్రీడాకారులు క్రికెట్ పోటీలలో పాల్గొన్నారు. పీడీ గాజుల లక్ష్మీప్రసాద్ క్రీడాకారులను పరిచయం చేసుకుని, నిబంధనలను వివరించారు. గ్రామ స్థాయిలో క్రికెట్ ఆటగాళ్లు 608 మంది నమోదయ్యారు. 26 పురుషుల జట్లు, 12 మహిళా జట్లు క్రికెట్ ఆడుతున్నాయి. ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విమలకుమారి, ఎంఈఓ ఎ.రామారావు, పీఆర్ ఏఈఈ వాసుదేవరావు, ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ క్రీడల ఇన్‌చార్జి బాధ్యతలో ఉన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు టీఎస్ రత్నకుమారి, కోసూరు పూర్ణచంద్రరావు, సీహెచ్ సుబ్బారావు, ఎం.శ్రీనివాస్, వి.సందీప్ పోటీలు నిర్వహిస్తున్నారు.
- మచిలీపట్నంటౌన్: క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలు నగరంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. నగరంలోని నోబుల్ కళాశాల మైదానంలో బుధవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. 16 టీమ్‌లు హాజరు కాగా వీరి మధ్య మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి. గురువారం నోబుల్ కళాశాల మైదానంలోనే 24 టీమ్‌లు హాజరై మ్యాచ్‌లు ఆడి ప్రతిభను చాటనున్నాయి.

సీఎం జగన్‌ను మరోసారి కోరుకుంటున్న ప్రజలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



బంటుమిల్లిలో పింఛన్లు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్



అవనిగడ్డలో పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక లంకమ్మ మాన్యంలో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను రూ. మూడు వేలకు పెంచారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటికొచ్చి పెన్షన్లు ఇస్తున్నారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, లంకమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్, ఎంపీటీసీ తోట గణేష్, మొగల్ హుస్సేన్ పాల్గొన్నారు.

బందరులో 94.3 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ పింఛను కానుక పథకంలో భాగంగా పెంచిన రూ. 3 వేల పింఛన్‌ను వలంటీర్లు రెండో రోజైన బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. నగరంలో మొత్తం 19,242 పింఛన్లు ఉండగా వీటిలో 18,145 పింఛన్లు పంపిణీ చేసి 94.3 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. ఇంకా 1,097 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది.

ఇచ్చిన హామీ నెరవేర్చిన సీఎం జగన్

బంటుమిల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ. 3 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇచ్చిన హామీలు 90 శాతానికి పైగా అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. అనంతరం ఇటీవల మృతిచెందిన ములపర్రు మాజీ సర్పంచ్ గౌరిశెట్టి మాధవరావు సంస్మరణ సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వి. చినబాబు, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైరన్ కె. గంగాధర్, పి. బాబూరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి పాల్గొన్నారు.

- మచిలీపట్నంటౌన్: నగరంలోని 2, 46 డివిజన్లలో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా డివిజన్లలో పలు వ్యాధులతో బాధపడుతున్న రోగులు శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందారు. పలువురు వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరాలను నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పరింకాయల విజయ్, భోగాది సాయిబాబు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి తదితరులు పర్యవేక్షించారు.

సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శం



కృష్ణా వర్సిటీలో నివాళులర్పిస్తున్న వీసీ జ్ఞానమణి తదితరులు

నాగాయలంక: భారత తొలి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే జీవితం మహిళలందరికీ ఆదర్శం కావాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక మత్స్యభవనంలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమం జరిగింది. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళల విద్య, మానవ హక్కులు, అసమానతలపై ఉద్యమించిన మహిళామూర్తి సావిత్రీబాయి పూలే అని చెప్పారు. పలువురు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే సేవలను వివరించారు. మత్స్యకార నాయకులు కర్రి కృష్ణమూర్తి, నాగిడి తాతారావు, బీసీ నాయకులు కె.సత్యనారాయణ, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే

చిలకలపూడి(మచిలీపట్నం): మహిళలకు విద్య నేర్పించేందుకు పాఠశాలలు, వసతి గృహాలు ఏర్పాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జి. జ్ఞానమణి అన్నారు. విశ్వవిద్యాలయంలో సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వితంతు మహిళా సంతానాన్ని దత్తత తీసుకున్న దార్శనికురాలు సావిత్రీబాయి పూలే అని అన్నారు. జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయి పూలే దంపతుల త్యాగాలను నేటి తరానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి. వీరబ్రహ్మాచారి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యకు ఆద్యురాలు..

చల్లపల్లి: మహిళలు విద్యకు నోచుకోని రోజుల్లో తన భర్త వద్ద విద్య నేర్చుకుని మహిళలకు విద్య నేర్పిన సంఘ సంస్కర్త సావిత్రీ బాయి పూలే అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె సేవలను వివరించారు. ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు కైతేపల్లి దాస్, కేశనకుర్తి శరత్‌బాబు, నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, సిద్ధాబత్తుల వాసు, ఒగిరాల నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో మంత్రి జోగి రమేష్ పూజలు



పైడమ్మ ఆలయం కమిటీ సభ్యులు, నాయకులతో మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులు

పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈయనతో పాటు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉదయం గుడ్లవల్లేరు మండలం కౌతవరం వద్ద కొండలమ్మగుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవదాయ శాఖాధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్‌తో కలిసి పెడన పట్టణంలోని గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. దేవదాయ శాఖతో పాటు ఆలయ కమిటీ వారు మంత్రి జోగి రమేష్‌కు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి పూజల అనంతరం ఆలయ కమిటీ వారు మంత్రి జోగి రమేష్‌ను ఘనంగా సత్కరించారు. పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో పైడమ్మను మంత్రి జోగి రమేష్ దర్శించుకున్నారు. శకుంతలాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మాజీ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, బళ్ల గంగయ్య, మల్లి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న పేర్ని కిట్టు

చిలకలపూడి(మచిలీపట్నం): మండల పరిధిలోని ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన చెక్కులను వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన కనపర్తి మాణిక్యాలరావు కుటుంబానికి రూ. 36 వేలు, మట్టా సూర్యనారాయణకు రూ. 30 వేలు మంజూరయ్యాయి. వీరికి చెక్కులను కిట్టు అందజేశారు. మాజీ సర్పంచ్ మట్టా మోహన నాంచారయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చోరగుడి రామచంద్రరావు, సచివాలయ కన్వీనర్లు గణేశన రమేష్, గణేశన వెంకటేశ్వరరావు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా పైడమ్మ జాతర ఉత్సవాలు



శిడిబండి ఊరేగింపులో నృత్యం చేస్తున్న కళాకారులు

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలు బుధవారం తొమ్మిదో రోజుకు చేరాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానికంగా ఉన్న భక్తులు సైతం మొక్కుబడులు తీర్చుకునేందుకు ఎడ్లబండ్లకు, ట్రాక్టర్లకు శిడిబొమ్మలు కట్టి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఆలయ కమిటీ వారు, దేవదాయ శాఖాధికారులు పర్యవేక్షించారు.

నేడు తెప్పోత్సవం..

పైడమ్మ ఆలయం వద్ద పదో రోజు గురువారం రాత్రి ఏడు గంటలకు అమ్మవారికి పైడమ్మ చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయ కమిటీ వారితో పాటు దేవదాయ శాఖాధికారులు, సిబ్బంది తగు ఏర్పాట్లను చేస్తున్నారు. పెడన సీఐ హబీబ్‌బాషా బందోబస్తుకు చర్యలు చేపట్టారు.

బందరులో కోలాహలం

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పేర్ని కిట్టు నియామకంతో ఆనందోత్సాహాలు



పేర్ని కిట్టుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, నాగేశ్వరరావు దంపతులు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ను పార్టీ అధిష్టానం నియమించడంతో మంగళవారం రాత్రి నగరంలో కోలాహలం నెలకొంది. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించారనే వార్తను ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ఆ పార్టీ శ్రేణులు ప్రధాన రహదారిలో కేరింతలు కొడుతూ ర్యాలీలు నిర్వహించారు. పెద్దఎత్తున బాణసంచా కాలుస్తూ ఆనందం వ్యక్తంచేశారు. తిరుపతిలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని రాత్రి నగరానికి చేరిన పేర్ని కిట్టుకు పార్టీ శ్రేణులు మూడు స్తంభాల సెంటర్ వద్ద స్వాగతం పలికి నగరంలో ర్యాలీగా పార్టీ కార్యాలయానికి తీసుకువచ్చారు. యువత పేర్ని కిట్టును భుజాలపై ఎక్కించుకుని నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో గడిపిన పేర్ని కిట్టు వారితో ఫొటోలు దిగారు.

పేర్ని కిట్టుకు శుభాకాంక్షల వెల్లువ..

పేర్ని కిట్టుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, నాగేశ్వరరావు దంపతులతో పాటు రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనంద బాబు (జానీ), పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కిట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారులు, వృద్ధురాలిని కాపాడిన వలంటీర్

చిలకలపూడి(మచిలీపట్నం): పెదపట్నం గ్రామంలో అగ్నిప్రమాదంలో కాలిపోతున్న ఇంటిలో ఉన్న మూడు, రెండేళ్ల వయస్సు ఉన్న ఇద్దరు చిన్నారులను, వృద్ధురాలిని వలంటీర్ సమయస్ఫూర్తితో కాపాడారు. గ్రామంలోని తోకల దేవమణి కుటుంబసభ్యులతో కలిపి ఉంటోంది. పనుల నిమిత్తం దేవమణి పెద్దలు బయటకు వెళ్లారు. ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అదే సమయంలో పింఛన్లు అందజేస్తున్న వలంటీర్ ప్రియదర్శిని ప్రమాదాన్ని చూసి ఇంటిలో ఉన్న ఇద్దరు పిల్లలను, వృద్ధురాలిని స్థానికుల సాయంతో బయటకు తీసుకువచ్చి కాపాడింది. సర్పంచ్ అనూషకు, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వలంటీర్‌ను గ్రామస్తులు అభినందించారు. అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబ సభ్యులకు కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి పెదవెంకయ్య రూ. 5 వేలు సాయం అందజేశారు. నిరాశ్రయులైన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పేర్ని నాని సహకారంతో నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అయోధ్య అక్షింతలకు గ్రామోత్సవం

మర్రిపాలెం(నాగాయలంక): అయోధ్య శ్రీరాముని పూజా అక్షింతలకు స్థానిక రామాలయం కమిటీ ఆధ్వర్యంలో మర్రిపాలెం గ్రామంలో బుధవారం గ్రామోత్సవం జరిగింది. తొలుత ఆలయంలో అక్షింతలు ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, మద్ది నాగేశ్వరరావు, భజన బృందాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

- బంటుమిల్లి: మండల పరిధిలోని రామవరపుమోడి, మల్లంపూడి గ్రామాల్లో బుధవారం అయోధ్య రాముల వారి అక్షింతల పంపిణీ చేశామని వీహెచ్‌పీ మండల కన్వీనర్ ఇల్లూరి నాగబాబు తెలిపారు. స్థానిక రామాలయం వద్ద పూజలు చేసిన పెద్దలు, రామ భక్తులు రాములవారి చిత్రపటాన్ని ట్రాక్టర్లపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

మూడు సీసీ రోడ్ల పనులు ప్రారంభం

మోపిదేవికాలనీ(మోపిదేవి): మండల పరిధిలోని మోపిదేవి వికలాంగుల కాలనీలో మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ నందిగం మేరీరాణి బుధవారం ప్రారంభించారు. సచివాలయ అసిస్టెంట్ ఇంజినీర్ ఫణి మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మూడు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కలపాల రాణి ఇంటి నుంచి గుర్రం ఆనందరావు ఇంటి వరకు 73 మీటర్ల పొడవు, 2.70 మీటర్ల వెడల్పుతో రూ. 3.20 లక్షలతోనూ, కందుల ఆదిలక్ష్మి ఇంటి నుంచి పెద్ది నాంచారయ్య ఇంటి వరకు 72 మీటర్ల పొడవు, 2.70 మీటర్ల వెడల్పుతో రూ. 3.15 లక్షలతోనూ, బావనారి ఉమాదేవి ఇంటి నుంచి లచ్చి శ్రీనివాసరావు ఇంటి వరకు 72 మీటర్ల పొడవు, 2.70 మీటర్ల వెడల్పు రూ. 3.15 లక్షలతో మొత్తం మూడు సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని వివరించారు. పాలకవర్గ సభ్యులు కేసగాని రాంబాబు, చిరివెళ్ల సంధ్యారాణి, నందిగం అభిషేకరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వికసిత్ భారత్ గ్రామ సభలు

పర్రచివర(నాగాయలంక): పర్రచివర, పెదపాలెం గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలు జరిగాయి. వీటితో నాగాయలంక మండలంలో ఈ కార్యక్రమాలు ముగిశాయి. ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించేందుకే గ్రామసభలు నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా క్యాలెండర్లు, బ్రోచర్లు ఆవిష్కరించారు. ఎదురుమొండి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు జరిగాయి. ఏఓ ఎ.సంజీవరావు ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షించగా గ్రామ కార్యదర్శులు మల్లికార్జునరావు, విజయకుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మోపిదేవి: మోపిదేవి నుంచి పెదప్రోలు వెళ్లే మార్గంలో జాతీయ రహదారిలో వాహనాలను పోలీసులు బుధవారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వాహనాలను పూర్తిస్థాయిలో తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. వాహనాల్లో రూ. 2 లక్షల కన్నా ఎక్కువగా నగదు తీసుకువెళితే వాటిని సీజ్ చేస్తామన్నారు. వాహనాల్లో మద్యం బాటిల్స్ సరఫరా చేసినా సీజ్ చేస్తామని హెచ్చరించారు. మోపిదేవి ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొత్త పెన్షన్ల పంపిణీ

కోడూరు: మండలంలో నూతనంగా మంజూరైన 124 పెన్షన్లకు సంబంధించిన నగదును గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదుగా ఈ కొత్త పెన్షన్లు పంపిణీ జరుగుతుందన్నారు. మండలంలో మొత్తం 7,632 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందుతున్నాయని, వీరికి పెరిగిన పెన్షన్ నగదును అందిస్తారని చెప్పారు.

రేపు మల్లవోలులో పెన్షన్ల పంపిణీ..

గూడూరు: మండలంలో కొత్తగా మంజూరైన సామాజిక పెన్షన్లు, పెరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం మల్లవోలులో జరుగుతుందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మల్లవోలు, ఐదుగుళ్లపల్లి, రామన్నపేట, పోలవరం, రాయవరం, కంచాకోడూరు, మద్దిపట్ల, ఆకుమర్రు గ్రామాల లబ్ధిదారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సాయి సత్య వ్రతాలు

బంటుమిల్లి: జానకీరామపురం గ్రామంలోని షిర్డీసాయి మందిరంలో బుధవారం శ్రీసాయి సత్యవ్రతాలు వైభవంగా నిర్వహించారు. బల్లారికి చెందిన ఘంటా శ్రీనివాస్ దంపతులు తదితరులు సాయి వ్రతాలు నిర్వహించారు. తొలుత సాయి మూల విగ్రహానికి పండితులు చంద్రశేఖర్ వేద మంత్రాల మధ్య పంచామృతాభిషేకం నిర్వహించారు. అన్నసమారాధన జరిగింది.